ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 13 జనవరి 2025 | 3





భోగి భాగ్యాలు పంచాలని..



సంక్రాంతి పండుగ వచ్చేసింది.. భోగభాగ్యాలు పంచాలని భోగిమంటలు వేయడం ఆనవాయితీ.. ఆ మంటల్లో కష్టాలన్నీ కాలిపోయి సుఖసంతోషాలు రావాలని.. సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ తొలిరోజు భోగి మంటలు వేస్తారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వీధివీధినా భోగిమంటలకు ఏర్పాట్లు చేశారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో భోగిమంట ఏర్పాట్లు ఇలా..

ఆలయాలకు.. పెద్ద పండగే!



ఆలయాలకు పండగొచ్చింది.. సంక్రాంతి సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు.. ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ మూడు రోజులు ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులుహాజరవుతారు. అందుకు తగిన విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ చిత్రంలో చూడండి.. అన్నవరం సత్యదేవుడి ఆలయాన్ని ఎలా ముస్తాబు చేశారో.. రంగవల్లులు వేశారు.. బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు. పువ్వులతో ఆలయాన్ని అందంగా అలంకరించారు.



శాండ్ బైక్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

సంక్రాంతి ఉత్సవాలకు
ఎస్.యానాం బీచ్ ముస్తాబు

ఉప్పలగుప్తం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.యానాం బీచ్ సంక్రాంతి ఉత్సవాలకు ముస్తాబైంది. గతంలో నిర్మించిన కళా వేదికను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక ప్రదర్శన లను ఎక్కువమంది తిలకించేలా ఏర్పాట్లు చేశారు. బీచ్ నుంచి గ్రామంలోకి మరో రెండు రహదారుల నిర్మాణం ద్వారా వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేశారు. యువతను, పిల్లలను ఆకట్టుకునేలా శాండ్ బైక్‌లు ఏర్పాటు చేశారు. ఆదివారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శాండ్ బైక్ రైడ్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే సంక్రాంతి సంబరాల్లో సినీ, టీవీ, మిమిక్రీ, మ్యాజిక్, మ్యూజిక్ కళాకారుల వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే చెప్పారు.



జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి మరోసారి కేంద్రం గర్తింపు

5

కేరళ తరహాలో... ఆత్రేయపురంలో డ్రాగన్ పడవ పోటీలు

5

ఆర్టీఏ తనిఖీలు

19 ప్రైవేటు బస్సులపై కేసుల నమోదు

రూ.2.75 లక్షల అపరాధ రుసుము వసూలు

అమలాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వచ్చే ప్రైవేటు బస్సులను ఆదివారం ఉదయం రావులపాలెం మండలం ఈతకోట వద్ద ఆర్టీఏ అధికారులు తనిఖీ చేశారు. 19 బస్సులపై కేసులు నమోదు చేశారు. అధిక చార్జీలు వసూలు చేసినందుకు, ఇతర క్రమశిక్షణా రాహిత్యాలకు మోటారు వాహన చట్టం ద్వారా రూ.2.75లక్షలను అపరాధ రుసుముగా వసూలు చేసినట్టు కోనసీమ జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, రవికుమార్, జ్యోతి సురేష్, షణ్ముఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రె..డీ



తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో కో..ఢీ

అదిరిపోయేలా : కాకినాడ అచ్చంపేట జంక్షన్‌లో ఏడీబీ రోడ్డు పక్కగా క్రికెట్ స్టేడియంలా ఏర్పాటు చేసినబరి..

సినిమా సెట్టింగ్ కాదు సుమా.. కోనసీమ జిల్లా మురమళ్లలో సకల హంగులతో ఏర్పాటు చేసిన బరి

పోలీస్ వర్సెస్ కోడి..ఈ పోటీలో గెలుపెవరిదో మరి కొన్ని క్షణాల్లో తేలిపోనుంది.. నిర్వాహకులు తగ్గేదేలే అంటే.. పోలీసులూ అదే దారిలో ఉన్నారు.. అక్కడక్కడా బేరాలు సాగిపోతున్నాయి. అటు పోలీసులు బరి తెగిస్తే.. ఇటు నిర్వాహకులు అదే దారిలో ఉన్నారు. కోడి పందాలు, గుండాట వంటి జూదాలకు ఎగబడుతున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే పండుగ మూడు రోజులు అనుమతిస్తారన్న ధైర్యంతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలకు కోడిపందెం పెద్ద ఆకర్షణగా మారింది. 21 నియోజకవర్గాల్లోనూ బరులు సిద్ధం చేశారు. గతంలో వైసీపీ నేతలు బరితెగిస్తే.. ఈసారి అదే ఒరవడిని కూటమి నేతలు కొనసాగించడం గమనార్హం.

(రాజమహేంద్రవరం/అమలాపురం/ దేవరపల్లి/ గోపాలపురం/ పెరవలి/ కొవ్వూరు/ ఐ.పోలవరం- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి కోడి పందాలకు రంగం సిద్ధమైంది. కోడి పందాలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీస్,రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిస్తున్నా నిర్వాహకులు మాత్రం తగ్గేదేలే అంటూ ఎప్పటి మాదిరిగానే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పందాలకు సర్వం సిద్ధం చేశారు. చాలాచోట్ల కోడి పందాల శిబిరాలు క్రికెట్ స్టేడియాలను తలపిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద బరులకు రూ.50 లక్షల వరకూ వేలంపాట వేస్తున్నారు. చిన్న గ్రామాల్లో కూడా రూ.16 లక్షల వరకూ ఉన్నాయి. జూదం విపరీతంగా పెరిగింది. ఒక్కో బరిలోనూ గుండాట నిర్వహణకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఇస్తున్నట్టు సమాచారం.గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీ ద్వితీయ స్థాయినేతలు,గ్రామనేతలు వీటిని ఎక్కువ నిర్వహిస్తున్నారు. జూద క్రీడల నిర్వహణకు ఆయా ప్రాంతాల్లో ఉన్న కూటమి నేతలు ముందుకు రావడం, ఎమ్మెల్యేల ద్వారా సిఫార్సులు చేయించుకుని అనుమతులు పొందడం ద్వారా లక్షల లాభార్జన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మూడు రోజుల పందాలు వారికి మంచి ఆదాయ వనరుగా మారాయి.గతంలో ఎన్నడూ లేనివిధంగా జూదం పెరిగిపోయింది. గతంలో అమ్మవారి తీర్థాల వంటి వాటికి చాటుమాటుగా గుండాట ఆడేవారు. ఇవాళ సంక్రాంతి అంటే అన్ని ఊర్లకు గుండాటలు వచ్చేశాయి. ఇవి మన సంప్రదాయమా? ఇది పచ్చి జూదం. అక్కడకు వచ్చిన ప్రజల జేబులను నిలువునా దోపిడీ చేస్తారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో థియేటర్‌ను తలపించేలా..



రంగంపేటలో బరి ధ్వంసం చేస్తున్న పోలీసులు

క్రికెట్ స్టేడియాలా..బరులా!

మురమళ్ల వద్ద పందెం బరిని మినీ స్టేడియాన్ని తలపించే రీతిలో తీర్చిదిద్దారు.ప్రత్యేక అతిథులు కొందరు సినీ నటులు బరికి హాజరయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా పక్కనే ఉన్న పాండిచ్చేరి రాష్ట్ర పరిధిలోని యానాంలో హోటళ్ల రూమ్‌లతో పాటు గెస్ట్‌హౌస్‌లను సిద్ధం చేసినట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలో నాలుగైదు చోట్ల కోడి పందాలు వేసేందుకు బరులు సిద్ధం చేశారు.ఐ.పోలవరంలో సుమారు 200 మంది వీఐపీలు కూర్చుని పందాలను తిలకించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ప్రధాన పందెం బరి చుట్టూ ఇనుప కంచెతో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. వీఐపీలకు పసందైన విందు భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ముమ్మిడివరంలో మాత్రం పోలీసులు ఓ బరి వద్దకు వెళ్లి ఏర్పాట్లను దగ్గరుండి తొలగించారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట శివారులో ఒక బరి, గోపాలపురంలో ఒక బరిని పోలీసులు ధ్వంసం చేశారు.

ఇక్కడే మద్యం..పేకాట ఉంటాయి.నీతులు వల్లించే పోలీసులు మామూళ్లకు కక్కుర్తిపడి చట్టాన్ని ప్రక్కన పడేస్తున్నారు.ఉభయ రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు భారీగా చేరుకుంటున్నారు.సోమవారం నుంచి ప్రారంభమయ్యే సంక్రాంతి ఉత్సవాలను తిలకించేందుకు ఉవ్విళ్లూరుతున్న వారికి జూదక్రీడలు ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి.

- నేటి నుంచి ఆటకు అంతా రెడీ
- బరి తెగించిన నిర్వాహకులు
- కూటమి నాయకుల గ్రీన్‌సిగ్నల్
- పోలీసులు వద్దంటున్నా ఏర్పాట్లు
- కొన్నిచోట్ల బేరసారాలు
- బరులకు వేలం నిర్వహణ
- ఒక బరి రేటు రూ.అర కోటి
- క్రికెట్ స్టేడియాల్లా తయారు
- అతిథులకు విందు భోజనాలు

పోలీసులూ బరి తెగించారు!

పట్టణాలు, పల్లెలు సహా అనేక ప్రాంతాల్లో పందెం బరులను బహిరంగంగా వేస్తున్నారు. వీటి నిరోధానికి పోలీసు,రెవెన్యూ అధికారులు హెచ్చరికలు తప్ప బరిలో మాత్రం దిగడంలేదు. పోలీసు యంత్రాంగానికి ఆయా ప్రాంతాల్లో జరిగే పందాల నిర్వాహకులు భారీగానే మామూళ్లు ముట్టచెబుతున్నారు. గతం కంటే భిన్నంగా ఈసారి మామూళ్ల రేట్లను పెంచేశారంటూ కొన్నిచోట్ల గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల సంయుక్త సహకారంతో పందెం బరులు సిద్ధమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 నియోజకవర్గాల పరిధిలో పందెం బరులు సిద్ధమయ్యాయి. జాతీయ రహదారులు, ప్రధాన రోడ్ల చెంతనే వీటిని ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు చెప్పిన బరులకే పోలీసులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు.ముందుగానే అన్ని మాటలు మాట్లాడుకున్న తర్వాతే వీటికి అనుమతులిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. పోలీసు యంత్రాంగం ఈసారి అసలు పట్టించుకోకపోవడం వెనుక రాజకీయపరమైన ఒత్తిళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. అధికారులు కనీసం ఉనికి చాటకపోవడం వెనుక భారీగా ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని ప్రచారం జరుగుతోంది.

లక్షల్లో గుండాట వేలం..

కోనసీమ జిల్లాలోని మురమళ్ల, చెయ్యేరు, ఎస్.యానాంతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగే పందెం బరుల వద్ద గుండాట బోర్డులు ఏర్పాటు చేసేందుకు బహిరంగ వేలం ద్వారా పాటలు జరిగినట్టు తెలిసింది. మురమళ్ల బరి వద్ద గుండాట కోసం ప్రత్యేక సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. చెయ్యేరులో గుండాట కోసం నిర్వాహకులు బరిని రూ.18 లక్షలకు దక్కించుకున్నట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లాలో అయితే రూ. 7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ వేలం జరిగినట్టు సమాచారం.

బరిలో బాక్సింగ్‌కు రెడీ..



డబ్ల్యుడబ్ల్యుఎఫ్ చూస్తుంటే... బాక్సింగ్ రింగ్‌లో దిగేటప్పుడు బాక్సర్లు ఒత్తిడిని అధిగమించడానికి ఎక్సర్‌సైజులు చేస్తుంటారు.. ఇక్కడ కోడిని చూడండి.. ఏం చేస్తోందో గమనించండి. సంక్రాంతి పండుగ వచ్చేయడంతో నేడో, రేపో ప్రతి కోడీ బరిలో దిగాల్సిందే.. ఈ మేరకు నిర్వాహకులు కోళ్లతో ఇలా ఎక్సర్‌సైజులు చేయిస్తున్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వీకే రాయపురంలో ఇలా...

కేరళ, తమిళనాడు తరహాలో
కొబ్బరి పరిశ్రమల అభివృద్ధికి కృషి

కొబ్బరి అభివృద్ధి బోర్డు చైర్మన్ శుభానాగరాజన్... రావులపాలెం సీఆర్సీలో కొబ్బరి బోర్డు ఆవిర్భావ దినోత్సవం

రావులపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేరళ, తమిళనాడు తరహాలో కొబ్బరి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని కొబ్బరి అభివృద్ధి బోర్డు చైర్మన్ శుభానాగరాజన్ పేర్కొన్నారు. రావులపాలెం సీఆర్సీ సమావేశ మందిరంలో ఆదివారం కొబ్బరి బోర్డు 45వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత చైర్మన్ శుభానాగరాజన్, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీలు యిళ్ళ వెంకటేశ్వరరావు, కుడుపూడి సూర్యనారాయణ జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి సలహాల మేరకు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కొబ్బరి అభివృద్ధి బోర్డు అధిక దిగుబడులు ఇచ్చే హైబ్రిడ్ వంగడాల సస్యరక్షణ సాంకేతిక టెక్నాలజీ ఆచరణ అంశాలకు పెద్దపీట వేస్తామన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల్లో కొబ్బరి పరిశ్రమల అభివృద్ధి కార్యకలాపాల పర్యవేక్షణకే కొబ్బరి బోర్డు ఏర్పాటు చేశామన్నారు. స్థానికంగా లభించే కొబ్బరికాయలను మాత్రమే రైతులు విక్రయించుకోవాల్సి వస్తోందన్నారు. ప్రోసెసింగ్ యూనిట్లు లేకపోవడంతో రైతులకు తగిన ఆదాయం సమకూరట్లేదన్నారు. ముడిసరుకు ఆధారంగా ప్రోసెసింగ్ కోసం క్లస్టర్లు, పార్కులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఏర్పాటు చేసుకుని అధికాదాయం పొందాలని రైతులకు సూచించారు. సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ ఇస్తామన్నారు. చీడపీడల నివారణ, అధిక ఆదాయం పొందే మార్గాలు చూపిస్తామన్నారు. తక్కువ ఎత్తులో అధిక దిగుబడులు ఇచ్చే మేలు రకం కొబ్బరి మొక్కలను తోటల పునరుద్ధరణ సమయంలో వినియోగించుకోవాలన్నారు.

బోర్డు సీఈవో, ఉద్యానవన శాఖ కమిషనరు డాక్టర్ ప్రభాత్‌కుమార్ మాట్లాడుతూ కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కొబ్బరి రైతులకు బోర్డు అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి కె.గోపాల్ మాట్లాడుతూ నాణ్యమైన కొబ్బరి ఉత్పత్తులు స్థానికంగా ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయ అనుసంధానంతో కోనసీమ ప్రాంతంలో మరింతగా కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులను మెరుగుపర్చేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు.

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో 1.50 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు చేపడుతున్నారన్నారు. దీని ఆధారంగా కొబ్బరిని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కొబ్బరి అభివృద్ధి బోర్డు రీజనల్ కార్యాలయాన్ని కోనసీమలో ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌ఆండ్‌ఆర్, ఎల్‌డీపీ స్కీమ్‌ల ద్వారా రైతులందరికీ సకాలంలో ఎరువులు అందించాలన్నారు. కొబ్బరి ఆధారిత ఉప ఉత్పత్తుల పరిశ్రమలను స్థాపించి 90 శాతం రాయితీ ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కొబ్బరికాయల నిల్వ గోదాములకు రాయితీ నిధులు విడుదల చేయాలన్నారు. కోనసీమ ప్రాంతానికి బోర్డు సభ్యులు మెరుగైన సేవలందించాలన్నారు. ఈ మధ్య కాలంలో చీడపీడల కారణంగా కోనసీమ జిల్లాలో కొబ్బరి తోటలు కనుమరుగవుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పంట సాగుకు తగిన సహకారం అందించాలని కోరారు. బోర్డు కోనసీమ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సీవీ త్రినాథ్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, జీడీ పుల్లారెడ్డి, బీవీ రమణ, ఎ.దుర్గేష్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. కొబ్బరి బోర్డు మాజీ అధికారి మిస్నీమాథ్యూను సత్కరించారు.



కొబ్బరి బోర్డు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న చైర్మన్, ప్రతినిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



60 కిలోల విభాగంలో విజేతలు (పైన)



60 కిలోల విభాగంలో ప్రథమ స్థానం సాధించిన దుర్గాప్రసాద్‌కు షీల్డు అందజేస్తున్న నిర్వాహకులు

బాడీ బిల్డింగ్‌లో యువత సత్తా

అమలాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ఆదివారం రాత్రి ఫస్ట్ యునైటెడ్ డిస్ట్రిక్ జోనల్ బాడీ బిల్డింగ్-ఫిజిక్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2025 ప్రారంభమైంది. కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. తొలుత అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్రోకెమ్ అధినేత నండెపు వెంకటేశ్వరరావు (బాలాజీ), బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, ఆశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో ఉమ్మడి జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను ప్రారంభించారు. అర్ధరాత్రి వరకు పలు విభాగాల్లో కొనసాగాయి. 55 కిలోల విభాగంలో ఎస్.రమేష్ (చింతూరు), బి.మనోజ్ కుమార్ (కాకినాడ), పి.రాజు (రాజమహేంద్రవరం) వరుస స్థానాల్లో నిలిచారు. 60 కిలోల విభాగంలో ఎం.దుర్గాప్రసాద్ (కాకినాడ) ప్రథమ, ఎస్.వెంకటరమణ (కాకినాడ) ద్వితీయ, వి.జార్జ్‌విట్‌ఫీల్డ్ (ప్రత్తిపాడు) తృతీయ, 65 కిలోల విభాగంలో ఎస్.దిలీప్ (రాజమహేంద్రవరం), కె.హర్ష (కాకినాడ), సీహెచ్ రవికుమార్ (రాజమహేంద్రవరం), 70 కిలోల విభాగంలో పి.బాలరాజు (కాకినాడ), ఎల్.దుర్గాప్రసాద్ (తుని), ఎస్‌కేజీ ఖాశిం (అమలాపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 75 కిలోల విభాగంలో పి.శివగణేష్ (అమలాపురం), జీపీఎస్ఎస్ఎస్ బాలాజీ (రాజమహేంద్రవరం), కేఎంటీ కుమార్ (మలికిపురం) వరుస స్థానాలు సాధించారు.

విజేతలకు జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పతకాలు, షీల్డులు, సర్టిఫికెట్లను కల్వకొలను తాతాజీ, లింగోలు పండు, రవణం వేణుగోపాల్ అందజేశారు. తొలుత సీనియర్ బాడీబిల్డర్లు చిత్రపు కుమార్, నగభేరి కృష్ణమూర్తి, గారపాటి చంద్రశేఖర్, దొమ్మేటి వెంకటరమణ, మట్టపర్తి సముద్రంలను సత్కరించారు. ఆశెట్టి ఆదిబాబు ఈవెంట్ ఆర్గనైజర్‌గా వ్యవహరించారు.

కేరళ తరహాలో....

ఆత్రేయపురంలో సర్‌ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీలో భాగంగా డ్రాగన్ పడవ పోటీలు

తిలకించిన ఎమ్మెల్యేలు, రుడా చైర్మన్





ఆత్రేయపురంలో నిర్వహించిన డ్రాగన్ పడవ పోటీలు, విజేతలకు మెడల్స్ అందజేసిన ప్రజాప్రతినిధులు

ఆత్రేయపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రధాన కెనాల్‌లో సర్‌ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కేరళ తరహాలో డ్రాగన్ పోటీలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ట్రోఫి పోటీలు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఆత్రేయపురం ప్రధాన కాలువలో రెండో రోజు ఆదివారం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కేరళను తలపించేలా డ్రాగన్ పడవ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. రాష్ట్రంలోని 9 జిల్లాల నుంచి 11 టీమ్‌లు 121 మంది పడవ పోటీలలో పాల్గొన్నారు. ఆత్రేయపురం నుంచి ఉచ్చిలి వరకు ప్రధాన కాలువకు ఇరువైపులా జనసందోహం పోటీలను తిలకించారు. కేరళ వాయిద్యాలు, ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా పోటీలను ఉత్సాహభరితంగా వీక్షించారు. ఎమ్మెల్యే బండారుతో పాటు రాజోలు ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిలు పడవ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. డ్రాగన్ పడవ పోటీలతో పాటు కాయాకింగ్, కెనాయింగ్, పారాకయ్య పడవ పోటీలు రసవత్తంగా సాగాయి. దివ్యాంగులు సైతం ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. పోటీల్లో జంగారెడ్డిగూడెం జెయింట్, పల్నాడు తండర్స్, ఎన్టీఆర్ ఈగల్స్, కోటిపల్లి సీతాష్, పల్నాడు పాంథర్స్, కృష్ణ లయన్స్ సెమి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం ఫైనల్స్ పోటీల్లో భాగంగా విజేతలను ప్రైజ్‌మనీ, జ్ఞాపికలతో సత్కరించనున్నారు. ఈ ట్రోఫిలో భాగంగా ఎమ్మెల్యే బండారుపై అభిమానంతో రాచకొండ శ్రీనివాస్ క్రియేట్ చేసిన పాట సీడీని ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కరుటూరి నరసింహరావు, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, విక్టరీ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, వివిధ శాఖాధికారులు ఉన్నారు.

పండుగ ఆనందం ఆవిరి!

» కొత్త దుస్తులు కొనేందుకు వెళ్తుండగా కబళించిన మృత్యువు

» రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



మరణించిన మేఘన



(ఫైల్‌ఫొటో)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు పిల్లలకు కొత్త దుస్తులు కొనాలని ఆనందంగా రాజమహేంద్రవరం మార్కెట్‌కు వెళ్తుండగా ప్రమాదం కబళించింది. ఈ ఘటనలో భార్య మృతిచెందగా భర్త తీవ్ర గాయాలపాలై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన గాడి గోపినాథ్, గాడి మేఘన (35) భార్యాభర్తలు. వారికి ఓ పాప, బాబు. గోపినాథ్ స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు పిల్లలకు దుస్తులు కొనుగోలుచేసేందుకు ఇద్దరూ ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం బైక్‌పై వెళ్తుండగా స్థానిక ఆటోనగర్ వద్దకు వచ్చేసరికి ఐషర్ వ్యాన్, కారు మధ్యకు వీరి బైక్ రావడంతో వ్యాన్ సైడ్ భాగం బ్యాక్ హ్యాండిల్ తగలడంతో ఇద్దరూ కింద పడిపోయారు. మేఘన వెనకకు పడడంతో తలకు బలమైన అక్కడికక్కడే మృతిచెంది ంది. గోపినాథ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి బొమ్మూరు పోలీసులు చేరుకుని మేఘన మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. వ్యాన్‌ను, కారును అదుపులోకి తీసుకున్నారు.

సంక్రాంతికి స్వగ్రామం వస్తుండగా..

నిద్ర మత్తులో బైక్ నుంచి జారి పడి యువకుడి మృతి



మరణించిన సత్యనారాయణ



(ఫైల్ ఫొటో)

దేవరపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి వస్తుండగా మోటార్‌సైకిల్ నుంచి జారిపడి యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామం వెళ్తుండగా మార్గం మధ్యలో దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం వద్ద ఆదివారం ఉదయం 5.50గంటలకు మోటార్‌సైకిల్ వెనుక కూర్చున్న కందిపల్లి సత్యనారాయణ (25) నిద్రమత్తులో జారిపడడంతో తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. సత్యనారాయణ ఉపాధి కోసం ఐదేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లి తాపీ పనిచేస్తుండగా అతడి చిన్నాన్న కందిపల్లి తలుపులయ్య వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి బావ సీహెచ్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఇద్దరూ హైదరాబాదులో శనివారం రాత్రి 9గంటలకు బయలుదేరినట్టు పేర్కొన్నారు.

ఊలపల్లిలో విషాధఛాయలు

బిక్కవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం జాతీయ రహదారిపై బైక్ జారి పడి కడిపల్లి సత్యనాయణ(25) మృతి చెందడంతో అతడి స్వగ్రామమైన బిక్కవోలు మండలం ఊలపల్లిలో విషాధఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన వీరబాబు, అన్నవరం దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు. కుమార్తెకు పెళ్లవ్వడంతో కుమారుడు సత్యానారాయణే తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. తాపీ పని చేసే సత్యనారాయణ హైదరాబాద్ వెళ్లి పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులను తన వద్దే ఉంచుకుంటున్నాడు. ఇటీవల ఊలపల్లిలో ఇల్లు కూడా నిర్మించాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా తల్లిదండ్రులను, ఈ ప్రాంతం నుంచి తాపీ పనికి వచ్చిన వారందరితో వ్యాన్‌లో పంపి సత్యనారాయణ తన బాబాయ్‌తో కలసి బైక్‌పై ఊలపల్లికి వస్తుండగా సూర్యనారాయణపురం వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పండుగ పూట ఊలపల్లిలో విషాధఛాయలు అలుముకున్నాయి.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి మరోసారి కేంద్రం గర్తింపు

కేంద్ర పర్యాటక వెబ్‌సైటులో ఏకాదశ రుద్రుల ఉత్సవం



వెబ్‌సైటులో రూపొందించిన ప్రభల ఉత్సవం

అంబాజీపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచం నలుమూలలకు విస్తరించిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవాన్ని మరోసారి కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవ్ విభాగంలోని వెబ్‌సైటులో చోటు కల్పించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన శివకేశవయూత్ సభ్యులు 450 ఏళ్లచరిత్ర కలిగిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యాన్ని చరిత్రను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లేఖరాశారు. దీంతో కేంద్ర పర్యాటక శాఖమంత్రిత్వ శాఖ ఉత్సవ నిర్వహణ, 11 ఏకాదశ రుద్రుల ప్రభల రూపాలు, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల రుద్రుల ప్రభలు పచ్చనిచేలను తొక్కుకుంటూ అప్పర్ కౌశిక దాటే దృశ్యాలు, ఉత్సవాన్ని తిలకించేందుకు జగ్గన్నతోటకు వచ్చేలక్షలాది జనం తదితర అంశాలను పరిశీలించారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి కేంద్ర పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో చోటు కల్పించారు. కేంద్ర పండుగల జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేర్పింది. ఇప్పటికే శివకేశవ యూత్ సభ్యులు ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాయడంతో ఆయన స్పందించి 2020లో ఏకాదశ రుద్రుల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతిలేఖను రాశారు. అలాగే 2023 జనవరి 26వ ఢిల్లీలో జరిగిన రిప్లబిక్ డే వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల థీమ్‌ను ప్రత్యేకంగా శకటంగా రూపొందించి ప్రదర్శించారు. దీంతో దేశ విదేశాల్లో జగ్గన్నతోట మరింత విస్తరించింది. తాజాగా కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వెబ్‌సైటులో చోటు కల్పించడంతో 11 గ్రామాల ప్రజలు, గంగలకుర్రు అగ్రహారం శివకేశవయూత్ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని కేంద్ర, రాష్ట్రపండుగగా నిర్వహించాలని కోరుతున్నారు.

రిప్లబిక్ డే వేడుకల్లో..

ప్రదర్శన ఇవ్వనున్న ముక్కామల అయ్యప్పస్వామి గరగబృందం



ఢిల్లీలో ముక్కామల కళాకారులు

అంబాజీపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 26న ఢిల్లీలో జరిగే వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల పుసుపులేటి అయ్యప్పస్వామి గరగ కళాకారుల బృందం ప్రదర్శించనున్నారు. గరగ నృత్య ట్రూప్ లీడర్ అయ్యప్పస్వామి ఆధ్వర్యంలో 100 మంది కళాకారులు ఢిల్లీలోని శకటం వద్ద ప్రదర్శించున్నారు. అలాగే ఈనెల 13న ప్రధాని నరేంద్ర మోదీ ఎదుట గరగనృత్య బృందం ప్రదర్శన ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. నృత్య ప్రదర్శనను కేంద్ర సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమి ద్వారా ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రదర్శన చేయనున్నట్టు తెలిపారు. గత నెల రోజుల నుంచి ఢిల్లీలో 100 మంది కళాకారులు సాధన చేస్తున్నట్లు అయ్యప్ప విలేకర్లకు తెలిపారు.

రేపటి నుంచి జాతీయ, రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడా ప్రాంగణంలో ఈనెల 14 నుంచి 17 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఇఫ్ ఇండియా సంయుక్తకార్యదర్శి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమనిచక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.చెలికానిస్టాలిన్ ఆదివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. 14వ ఆల్‌ఇండియా 20వ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. బాస్కెట్ బాల్ టోర్నమెంటు మంత్రి వాసంశెట్టి సభాష్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గంటి హరీష్‌మాధుర్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి హాజరవుతారని తెలిపారు. 17న విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ జరుగుతుందని వారు పేర్కొన్నారు.

రత్నగిరిపై డీఐజీ పూజలు



డీఐజీకి వేదపండితుల ఆశీర్వచనం

అన్నవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం అగ్నిమాపకశాఖ డీఐజీ నిరంజనరెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు.

నేడు సంక్రాంతి సంబరాలు

అన్నవరం దేవస్థానంలో సోమవారం ఉదయం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఉదయం 5గంటలకు భోగి మంటలతో ప్రారంభిస్తారు. తెలుగుదనం ఉట్టిపడేవిధంగా వివిధ జానపద నృత్యాలు, వేషధారణలు, కోడిపుంజులు, ఎడ్లబండి, బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.

శానిటేషన్ స్టాక్‌యార్డులో అగ్నిప్రమాదం

రూ.15లక్షల ఆస్తి నష్టం



గొల్లప్రోలులో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గొల్లప్రోలు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీ శానిటేషన్ స్టాకుయార్డులో ఆదివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగి రూ.15లక్షల ఆస్తి నష్టం సంభవించింది. నగర పంచాయతీ శానిటేషన్ విభాగానికి చెందిన పరికరాలు, మిషన్లు, సామగ్రి భద్రపరిచినగదిలో ఆకస్మాతుగా మంటలు చెలరేగి అక్కడే చెప్పులు నిల్వ చేసిన గొడౌన్‌కు వ్యాపించాయి. ప్రమాదంలో స్టాకు యార్డులోని ఫాగింగ్ మిషన్లు, స్ప్రేయింగ్ మిషన్లు, చెట్లు, గడ్డి, కరోనా మిషన్లు, చీపురుకట్టలు, డస్ట్‌బిన్లు తదితర సామగ్రి కాలిపోయాయి. కాలిన శానిటేషన్ పరికరాలు విలువ రూ.7లక్షలు వరకూ ఉంటుందని చెబుతున్నారు. అదేవిధంగా గోడౌన్‌లో పండుగ విక్రయాలు నిమిత్తం భారీగా నిల్వ చేసిన చెప్పులు కాలిపోవడం వల్ల రూ.8లక్షలకు పైగా నష్టం జరిగిందని షాపు యజమాని గండే నాగేశ్వరరావు తెలిపారు. భారీగా మంటలు చెలరేగడంతో అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గొల్లప్రోలు తహశీల్దారు సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీల్లో పాల్గొన్న ఆర్చర్లు

పిఠాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి ఆర్చర్లు పోటీ పడ్డారు. ఇండియన్ రౌండ్ విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచిన 12మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో జె.రాఘవేంద్ర అరుణ్, పి.నాని, బి.జయదీప్, జేఆర్.ఆదిత్య, ఎస్.లీలాప్రణవ్‌రెడ్డి, వి.రిత్విక్‌లు.. బాలికల విభాగంలో జె.ఐశ్వర్య సూర్యదీపిక, ఎస్‌కే హమీదా, పి.లక్ష్మీ, పీపీపీ చంద్రిక, కేఆర్‌పీసీ సుహాసిని, బి.తేజస్వినిదేవి విజయవాడలో ఈనెల 23నుంచి 25 వరకూ జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. పోటీలను రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, విరవాడ సర్పంచ్ బోయి నాగేశ్వరరావు, ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు సోము గోవిందరాజు, కె.చిన్నబ్బాయి, జే.ప్రసాదరావు ప్రారంభించారు. విజేతలకు ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రిన్సిపాల్ కేశవరావు, కౌన్సిలర్లు రాయుడు శ్రీనుబాబు, అల్లవరపు నగేష్, అభ్యుదయ ఫౌండేషన్ ప్రతినిధి బాదం సూర్యప్రకాష్, దానం లాజర్ బాబు, వెన్నపు చక్రధరరావు, రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కేతవరపు కృష్ణలు బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.శివప్రసాద్, పి.సాయి, బి.నవీన్‌వంశీలు వ్యవహరించారు.

మన్యంలో చింతూరు కేంద్రంగా రెండో అసెంబ్లీ సెగ్మెంట్?

(రంపచోడవరం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మేరకు రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరగాల్సి రావడం, త్వరలో జరిగే నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియపై ఇటీవల తీవ్రస్థాయిలో చర్చ సాగుతుండడంతో రంపచోడవరం మన్యంలోని గిరిజన ఆశావాహుల్లో ఇక్కడ ఏర్పాటు కాబోయే రెండో ఎస్టీ నియోజకవర్గం పైనా చర్చ సాగుతోంది. 2014లో జరిగిన రాష్ట్ర పునర్విభజన అనంతరం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం 11 మండలాలతో అతి పెద్ద గిరిజన నియోజకవర్గంగా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ నియోజకవర్గం పరిధి ఇటు ఎమ్మెల్యేలకు, అటు ప్రజానీకానికి ఇబ్బందికరంగా మారింది. ఇక్కడ భౌగోళిక పరిస్థితులు తద్వారా ఎదురైన పరిస్థితుల నేపథ్యంలో రంపచోడవరం నియోజకవర్గం కచ్చితంగా రెండుగా విభజించబడాల్సిన ఆవశ్యకతను అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి, విలీన మండలాలతో కలిపి ఓ నియోజవర్గం ఏర్పాటుపై చర్చిస్తున్నారు. రంపచోడవరం నుంచి మరో నియోజకవర్గాన్ని విభజిస్తే 4 విలీన మండలాల్లో చింతూరు కేంద్రంగా ఇది ఏర్పాటవుతుందని భావిస్తున్నారు. అయితే ఈ 4 మండలాలకు అదనంగా ఇప్పటికే పోలవరం నియోజవర్గంలో విలీనమైన పూర్వపు భద్రాచలం నియోజకవర్గంలోని వేలేర్‌పాడ్, కుక్కనూరు మండలాలను కలిపి కొత్త నియోజకవర్గంగా చేస్తారా, లేక ఇపుడు రంపచోడవరం లోనే ఎగువ ప్రాంతంలో ఉన్న వై.రామవరం ఎగువ ప్రాంతాల పంచాయితీలతో పాటు మారేడుమిల్లి మండలాన్ని కూడా అందులో కలుపుతారా అన్న చర్చలు సాగుతున్నాయి. ఏదిఏమైనా నియోజవర్గాల పునర్విభజన రంపచోడవరం మన్యానికి బాగా దోహదపడుతుందని, మరికొంతమంది గిరిజన నేతలకు అవకాశం వస్తుందని పలువురు ఎదురుచూస్తున్నారు.

చోరీకి వచ్చి.. పోలీసులకు చిక్కి

ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన ముగ్గురి పట్టివేత

గోకవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ ముగ్గరు దొంగలు పోలీసులకు పట్టుబడగా మరో దొంగ పరారీలో ఉన్నాడు. డీఎస్పీ దేవకుమార్, సీఐ సత్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామానికి చెందిన ఏపూరి బెనర్జీ, నరసరావుపేటకు చెందిన రాచపూడి రాకేష్, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన కొత్త గణేష్ ఈ నెల 10న కారుపై గోకవరం వచ్చి ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులను చూసి కారులో పారిపోయే ప్రయత్నంచేయ బోయారు. ఇంతలో ఎస్‌ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి గుమ్మళ్ళదొడ్డి సమీపంలో కారును చుట్టుముట్టి పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన శ్యామ్‌సన్ పరారీలో ఉన్నాడు. అతడిపై గతంలో అనేక కేసులున్నాయి. బ్యాంక్ మేనేజర్ కందుకుర్తి సతీష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆదమరిచి నిద్రిస్తుండగా..

అర్ధరాత్రి దొంగలు పడ్డారు

30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50లక్షల నగదు చోరీ



క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్న సీఐ

అమలాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వరకు టీవీ చూసి ఇంట్లో ఆదమరిచి నిద్రిస్తుండగా దొంగలు పడి రూ.10.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టణ సీఐ వీరబాబు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శివారు కురసాలవారి వీధిలో కోలా శేషు నివాసం ఉంటున్నాడు. సంక్రాంతి పండుగ కావడంతో భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్లారు. శనివారం రాత్రి శేషు ఒక గదిలో, తల్లి మరో గదిలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి వరకు టీవీ చూసిన శేషు ఆదమరిచి నిద్రపోయాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో మెలకువ రావడంతో లేచి బాత్‌రూమ్‌కు వెళుతుండగా కిటికీ తలుపులు తెరిచి ఉండడాన్ని ఇంట్లో సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని గుర్తించాడు. ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించి వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. బీరువాకు తాళాలు వేసి ఉండకపోవడంతో పాటు లాకరు తాళాలు కూడా అక్కడే ఉండడంతో కిటికీ తలుపులు తెరుచుకుని లోనికి వచ్చిన దొంగలు బీరువాలోని 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50లక్షల నగదుతో కలిపి రూ.10.50లక్షల మేర అపహరించుకుపోయారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు సిబ్బందితో వచ్చి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. నేర ప్రదేశాన్ని పరిశీలించారు. డీఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వేడ్‌ను రప్పించి పలు ఆధారాలు సేకరించారు. అనుమానితుల నుంచి వేలిముద్రలను తీసుకున్నారు. శేషు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాపికొండల విహారానికి 15 బోట్లు

దేవీపట్నం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రకృతి ప్రేమికులు పాపికొండల అందాలు తిలకించేందుకు 15 బోట్లలో 1042 మంది ఆదివారం పేరంటాలపల్లి వెళ్లారు. మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మడిపల్లి, మంటూరు, తాళ్లూరు, గొందూరు, కచ్చులూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు వెళ్లి సుమారు 2గంటల పాటు సందడి చేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మను దర్శించుకునివెళ్లారు.

మూడు రోజులు హౌస్‌ఫుల్

సంక్రాంతి పండుగ 3రోజులు పాపికొండలు విహారయాత్రకు వెళ్లే పర్యాటకుల టిక్కెట్లు హౌస్‌ఫుల్ అయినట్లు బోటు నిర్వాహకులు తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో టిక్కెట్లు

వెయ్యికి పైగా పర్యాటకులు

ఇప్పటికే అమ్ముడయ్యాయని వివరించారు.

పర్యాటక బోట్ల కాల వ్యవధి పెంచండి

పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల కాల వ్యవధి పెంచాలని పర్యాటకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పాపికొండలు వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో హైదరాబాద్, బెంగుళూరు నుంచి పర్యాటకులు ముందుగాను టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు బోటు పాయింట్‌కు చేరుకోవడానికి సమయం 40 నిమిషాలు ఆలస్యమవడంతో ప్రభుత్వ బోటు అధికారులు నిలిపివేశారు. దూర ప్రాంతాల నుంచి బయలుదేరడంతో సమయానికి రాలేకపోయామని పర్యాటకులు సబ్‌కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించగా విహారయాత్రకు అనుమతి ఇచ్చారు.



బోటు పాయింట్ వద్ద పర్యాటకుల సందడి

అమలాపురం

అంతర్వేదిలో ఎంపీ పూజలు

అంతర్వేది, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

అమలాపురం టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఇందుపల్లిలో సామాజిక నేత్ర ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గొడవర్తి సత్యనారాయణ మూర్తి నేత్ర వైద్య కేంద్రం పర్యవేక్షణలో శ్రీబాలభక్త గణపతి సేవాసంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

పలు పాఠశాలల్లో సందడి

పి.గన్నవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల తరువాత చదువుకున్న పి.గన్నవరం హైస్కూల్లో 1985-86 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీఎస్వీ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. తొలుత పాఠశాల ఆవరణలో ఉన్న వివేకనందుడు, సరస్వతిదేవి విగ్రహాలకు పూలమాలలు వేశారు. నక్కా సత్యనారాయణ, సుంకర వెంకటకృష్ణ, యడ్ల ఏసుభాస్కరరావు, విప్పర్తి వెంకటేశ్వరావు సాధనాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి మదన్, అన్నాబత్తుల రాజా, కోట రాజ్యలక్ష్మి, కోట బేబిసుజాత పాల్గొన్నారు. నరేంద్రపురం హైస్కూల్లో 1988-89 పదో తరగతి విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. గురువులను ఘనంగా సన్మానించారు. పేరిచర్ల నాగరాజు, గనుగుల రవికుమార్, బండి లక్ష్మణరావు, కృష్ణమాచార్యులు, పులపర్తి రవికుమార్, ఏడిద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





అంబాజీపేట:పుల్లేటికుర్రులో 57ఏళ్ల తరువాత, పి.గన్నవరం: నరేంద్రపురం హైస్కూల్లో 1988-89 పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

మలికిపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ ప్రతి వ్యక్తి జీవితంలో ఎంతో కీలకమైందని, ఆ దశను సక్రమంగా వినియోగించుకున్న వారు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మలికిపురం ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల సెక్రటరీ-కరస్పాండెంట్ మంగెన వెంకటసత్యనారాయణమూర్తి అన్నారు. ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల ప్రాంగణంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల్లో చదివి ఉన్నత స్థానాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారు, వ్యాపార, రాజకీయ, క్రీడా రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించిన అనేకమంది తమకు విద్యతో పాటు విలువలు అందించిన తమ విద్యా సంస్థలో మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల తాత్కాలిక చైర్మన్ రుద్రరాజు పద్మరాజు, జాన శంకరరావు, నల్లి ఆనందమహానీ, ముప్పర్తి వెంకటసత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆ పాత మధురానుభూతులు

మామిడికుదురు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): 38ఏళ్ల క్రితం ఆ చదువుల బడిలో విద్యాభ్యాసం చేసిన వారు ఆదివారం కలుసుకుని స్కూలు ఆవరణలో సందడి చేశారు. లూటుకుర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1986-87 బ్యాచ్ చెందిన పదో తరగతి విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యాలయంలో కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తమకు విద్యాభ్యాసం చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఆటలు ఆడి పాటలు పాడుతూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కడలి నూకరాజు, కుడుపూడి శ్రీధర్, కడలి రాంబాబు, పాయసం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

57ఏళ్ల తర్వాత

అంబాజీపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము.. చదువుల చెట్టు నీడలో అంటూ పుల్లేటికుర్రు, అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పూర్వవిద్యార్థులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. పుల్లేటికుర్రు జడ్పీ హైస్కూల్‌లో 1968-69లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 57ఏళ్ల తరువాత కలుసుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా ఒకే చోటకు చేరుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని నిక్‌నేమ్‌లతో పిలుచుకున్నారు. తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకుని యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అంబాజీపేటలో 1997-98 పాఠశాల విద్యార్థులు కలుసుకుని ఆనందంగా గడిపారు.

మొక్కలు నాటారు

అమలాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తిరిగి అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తాము చదువుకున్న తరగతి గదుల్లో సందడి చేశారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్ఎం కాశి ఘనసత్యనారాయణను సత్కరించి మెమెంటో అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష నిధులను కేటాయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆనంద్, కరాటం మంగరాజు, గుమ్మళ్ల రవి, రావూరి విజయ్, గాయత్రి, సత్యవెంకటపతి పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలలో

అంతర్వేది, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిపాలెం వికాస్ ఒకేషనల్ కళాశాలకు చెందిన 2004-06 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మరలా కలిశారు. అప్పటి ప్రిన్సిపాల్ కత్తిమండ ప్రతాప్‌ను సన్మానించారు. ఆకుల హనుమాన్, గుబ్బల చంద్రశేఖర్, బత్తుల రేవంత్, తాటిచెర్ల ప్రసన్నకుమార్, బాబ్జీ, రమేష్, రామారావు, స్వప్న, శిరీష తదితరులు పాల్గొన్నారు.

38ఏళ్ల తర్వాత కలయిక

యానాం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1987బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం చదువుకున్న చదువులమ్మ చెట్టునీడలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబసభ్యులను పరిచయం చేసుకుని ఆనందోత్సవాలతో గడిపారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సలాది సుబ్బారావు, సలాది సాంబశివరావు, సౌభాగ్యవతి, దూళిపూడి నాగేశ్వరరావు, ఖదర్ మాస్టర్ల గృహాలకు వెళ్లి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైమానికదళ మాజీ అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి దవులూరి బులివీరస్వామి, నిసర్గ ఇన్ఫ్రేషన్ అధినేత కన్నన్, పూర్వ విద్యార్థులైన పలువురు వివిధ శాఖల ఉన్నతాధికారులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

1993-94బ్యాచ్ ఆత్మీయ కలయిక

ఉప్పలగుప్తం,జనవరి12(ఆంధ్రజ్యోతి):గొల్లవిల్లి జడ్పీ హైస్కూలు1993-94బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మూడు దశాబ్దాల అనంతరం ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని గత స్మృతులను గుర్తుచేసుకు న్నారు. పాఠాలునేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కుటుంబాల స్థితిగతులపై మాట్లాడుకున్నారు. తమకు చదువు చెప్పి కీర్తిశేషులైన ఉపాధ్యాయులకు నివాళి అర్పించారు. గొల్లవిల్లిలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు భూమి విరాళంగా ఇచ్చిన ఉపాధ్యాయుడు దివంగత చిక్కం సత్తిరాజు విగ్రహాన్ని ఏర్పాటుచేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ షటిల్ ప్లేయర్ సాత్విక్ సాయిరాజ్ తండ్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ముగిసిన రోలర్ స్కేటింగ్ పోటీలు

అమలాపురం టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమరోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో అమలాపురం బాలయోగి స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు రెండో రోజైన ఆదివారం హోరాహోరీగా జరిగాయి. క్లబ్ అధ్యక్షుడు కేఎన్ మూర్తి, కార్యదర్శి ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ), సీనియర్ నాయకుడు గంధం పల్లంరాజు, పోలిశెట్టి ధర్మారావు, పోలిశెట్టి శ్రీదేవి మంగతాయారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు, షీల్డులు అందజేశారు. కోచ్ బి.సతీష్‌కుమార్, అసిస్టెంట్ కోచ్ కె.సంపత్‌కుమార్, ఆర్గనైజింగ్ బృందం సభ్యులు రాయుడు గిరి, బలశాడి బుజ్జి, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మలికిపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మలికిపురం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్ఎస్ ల్యాండ్‌మార్క్ వద్ద ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పూర్ణిమాదుర్గ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

అమలాపురం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీబాలభక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీశ్రీనివాసుని కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. తొలుత పద్మావతి అలివేలుమంగ సమేత శ్రీనివాసుని గ్రామోత్సవం నిర్వహించారు. వాడపల్లి ఆలయ బ్రహ్మ వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఇందుపల్లి అరవగరువులో ఏర్పాటుచేసిన ప్రత్యేక కల్యాణ వేదికపై కల్యాణం జరిపించారు. కల్యాణకర్తలుగా వీరి రామకృష్ణ-ఫణికుమారి దంపతులు వ్యవహరించారు.

ఘనంగా స్వామి వివేకానందుని జయంతి

అమలాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని అమలాపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా ఎర్రవంతెన వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. సీనియర్ నాయకుడు ఆర్వీ నాయుడు, సీఐ ఆర్.అంకబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు నివాళులర్పించారు. లయన్స్ క్లబ్, వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి జరిపారు. బోనం సత్యవరప్రసాద్, బూరగాయల శివరామకృష్ణ, గోకరకొండ నాగేంద్ర, గుర్రం రామకృష్ణ, పుత్సా కృష్ణకామేశ్వర్, పట్నాల రమణ, కొండేటి ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.



అమలాపురంలో స్వామివివేకానందుని విగ్రహానికి పూలమాలలువేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దొరబాబు

సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి

ముమ్మిడివరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వివేకానందుని ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పళ్లవారిపాలెం వివేకానంద వారధి వద్ద వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ యువతలో చైతన్యం తీసుకువచ్చి సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తి చేసిన మహోన్నత వ్యక్తి వివేకానందుడన్నారు. వివేకానంద వారధి వద్ద జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోదశి గంగరాజు, గోదశి నాగేశ్వరరావు, కోనే రామకృష్ణ, చిక్కం శ్రీనివాసరావు, కోనే వెంకట్రామారావు, పెట్టా సుధాకర్, కొప్పిశెట్టి కృష్ణమూర్తి, తొత్తరమూడి ప్రభాకరరావు, కోనే శేఖర్, రంకిరెడ్డి రాంబాబు, పెట్టా జగన్, పోలిశెట్టి బోసు, జంగా డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో జరిగిన వివేకానందుని జయంతిలో వీరవల్లిపాలేనికి చెందిన సలాది స్వామినాయుడు, సలాది బుచ్చిరాజు కుటుంబ సభ్యులు దివ్యాంగులకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, యాళ్ల ఉదయ్, గొలకోటి వెంకటరెడ్డి, గాలిదేవర బుల్లి, గొలకోటి వీరహనుపద్మజ, గొలకోటి రాజబాబు, భోగి శ్రీనివాసరావు, ఆకుల నారాయణలతో పాటు పలువురు పాల్గొని వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

వివేకానందుని జయంతి

పి.గన్నవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్లో వివేకానందుని 162వ జయంత్యుత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు వివేకానంద విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్ఎం డీఎస్వీ ప్రసాద్, అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.అంజన్‌శ్రీ నివాస్, వివేకానంద యూత్ అధ్యక్షుడు బొరుసు చంద్రశేఖర్, ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవా ప్రముఖ జి.అమ్మిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలి

మలికిపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి అడబాల నరసింహారావు కోరారు. కేశనపల్లిలో వివేకానందుని విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ అడబాల నారాయణస్వామి, ముత్యాల బుల్లబ్బులు, రేకపల్లి వెంకటేశ్వరరావు, కొణిదెల శ్రీను పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం

అయినవిల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆదివారం నేదునూరులో రావి ఫౌండేషన్ కార్యాలయం వద్ద కార్యదర్శి పాలగుమ్మి వెంకటకృష్ణ అధ్యక్షతన యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రావి బాలకృష్ణ(బాబ్జీ) మాట్లాడుతూ యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రావి ఫౌండేషన్ ఉచిత కంప్యూటర్ సెంటర్‌లో శిక్షణ పొందిన 54మంది యువతీ యువకులకు ధ్రువపత్రాలు అందజేశారు. వివేకానందుని జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగాయి. ఆయా పోటీల విజేతలకు పెద్దాపురం సీఐ ఆర్.అంకబాబు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. వివేకానంద కేంద్ర ప్రతినిధి శారద, కార్యదర్శి గొవ్వాల నాగరాజు, ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావు, రవణం వేణు, భానుమూర్తి, కామన కృష్ణమూర్తి, ఎంపీటీసీ యిందుగుల వెంకటరమణయ్య పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

అంబాజీపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని నడుచుకోవాలని అమలాపురం స్పెషల్ కోర్టు జడ్జి పులిదిండి వెంకటప్రసాద్, పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు పేర్కొన్నారు. అంబాజీపేట హైస్కూల్‌లో అరిగెల కృష్ణమూర్తి గురుజాడ కళావేదిక కన్వీనర్ అరిగెల బలరామమూర్తి ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొంతు పెదబాబు, పితాని త్రిమూర్తులు, నాగాబత్తుల నరసింహమూర్తి, పులిదిండి సత్యనారాయణ, అరిగెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడికి నివాళి

యానాం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో జాతీయ యువజన దినోత్సవాన్నినిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఏపీ, యానాం డైరెక్టర్ అన్నుమాన్ ప్రసాద్, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొన్నారు. వివేకనందుడి చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా యువజన అధికారి తీర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజినల్‌కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణాసుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.ముత్యాలు, వానంశెట్టి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి మీ ఊరికి వస్తున్నాం'

సినీ హీరోయిన్ మీనాక్షీ చౌదరి



అమలాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి. ఆ సంక్రాంతికి మీ ఊరికి వస్తున్నాం. కుటుంబ సమేతంగానే కాదు పండుగకు వచ్చిన బంధువర్గీయులు, స్నేహితులు అందరూ చూసే సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' అని ఆ చిత్ర హీరోయిన్ మీనాక్షీ చౌదరి తెలిపారు. ఆదివారం అమలాపురంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె కొద్దిసేపు విలేకరులతో సినిమా కబుర్లు చెప్పారు. 'ఇప్పటివరకు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించాను. తెలుగు ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ మరిచిపోలేను. గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం' సినిమాతో వచ్చాను. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం.. చిత్రంలో మీనా పాత్ర మంచి గుర్తింపు తీసుకుకొస్తుంది. వెంకీ మామతో కలిసి నటించిన ఈచిత్రం ప్రేక్షకుల ఆశీస్సులు, ఆదరాభిమానాలతో గ్యారంటీగా ఘన విజయం సాధిస్తుంది. సినిమాలోని కామెడీ బ్లాక్ బస్టర్ రేంజ్‌లో ఉంటుంది. దర్శక, నిర్మాతలు సైతం లక్కీ హ్యాండ్‌గా గుర్తించి ప్రేక్షకులకు కలకాలం గుర్తుండే పాత్రలు నాకివ్వడం చాలా ఆనందంగా ఉంది. గతంలో ఒకసారి కోనసీమకు వచ్చా. మళ్లీ ఇక్కడకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. సంక్రాంతి పండుగ అంతా ఇక్కడే కనిపిస్తోంది. ఈ ప్రాంత ప్రజల అతిథి మర్యాదలను ఎప్పటికీ మరిచిపోలేను' అని మీనాక్షీ చౌదరి తెలిపారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంకు చెందిన దాకే హర్షవర్ధన్‌చక్రవర్తి ఆదివారం మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదానం ట్రస్టుకు రూ.10,001 విరాళంగా ఇచ్చారు.

బరులను ధ్వంసం

ముమ్మిడివరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కోడిపందాల నిర్వహణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ముమ్మిడివరం పోలీసులు అడ్డుకున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలో కోడిపందాల నిర్వహణకు బరులను సిద్ధం చేస్తుండగా ఆదివారం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు బరుల వద్ద ఏర్పాటుచేసిన సర్వే కర్రలను తొలగించి బరిని ధ్వంసం చేశారు. మండలంలో అన్నంపల్లి, కొత్తలంక, రాజుపాలెం, గేదెల్లంక గ్రామాల్లో కోడిపందాల నిర్వహించనున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో అక్కడ కూడా నిఘా ఏర్పాటు చేశారు. రాజుపాలెంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు.

కోడిపందాలకు రంగం సిద్ధం

అల్లవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కోడూరుపాడు, అల్లవరం, గుడ్డివానిచింత, గుత్తులవారిపాలెం, తూర్పులంక, రెల్లుగడ్డ, దేవగుప్తం, గుండెపూడి గ్రామాల్లో కోడి పందాలకు బరులు సిద్ధమయ్యాయి. షామియానాలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సంక్రాంతి ఉత్సవాలు

మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న మెట్రోకెమ్ అధినేత బాలాజీ, ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా మాదిరిగానే అమలాపురం ఎర్ర వంతెన సమీపంలోని ఎన్వీఆర్ నగర్‌లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సంక్రాంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధంచేసినట్టు మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరావు (బాలాజీ) అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈఉత్సవాలను వైవిధ్యంగా చేస్తున్నామన్నారు. తాను వ్యాపారరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ ఈప్రాంతవాసిగా ఇక్కడ ప్రజల్లో ఆనందాన్ని నింపేందుకు ఈమూడు రోజులు ఉత్సవాలు చేస్తున్నట్టు తెలిపారు. సోమవారం భోగి పండుగ నుంచి ప్రారంభమై వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామని, రాత్రి సమయంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సంక్రాంతి పండుగ రోజున భారీగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. వందల సంఖ్యలో పోటీలకు చిన్నారుల నుంచి వృద్ధాప్యంలో ఉన్న మహిళలు కూడా పాల్గొంటారని చెప్పారు. కనుమ పండుగ రోజున ప్రభల తీర్థంతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత విభావరితో పాటు బుధవారం రాత్రి కనులు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు జరుగుతాయన్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై ఈకార్యక్రమాలు తిలకించాలని కోరారు. సమావేశానికి హాజరైన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మెట్రోకెమ్ అధినేత బాలాజీ చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. విలేకరుల సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీరాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, అల్లాడ శరత్, గంధం పల్లంరాజు తదితరులు పాల్గొని ఎంతో వ్యవప్రయాసల కోర్చి సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న బాలాజీని అభినందించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొమ్ముల ఆత్మీయ కలయిక

మామిడికుదురు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామంలో కొమ్ముల కుటుంబాలవారి ఆత్మీయ కలయిక ఆదివారం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. పాత మండువా లోగిళ్ల పేరిట నిర్వహించిన ఆత్మీయ కలయికలో చిన్నారులు నృత్యాలుచేసి అలరించారు. మహిళలు కోడి పందాలు నిర్వహించి సందడి చేశారు. కొబ్బరాకులతో వివిధ కళాకృతులు, రావి ఆకులపై చిత్రించిన వివిధ రకాల దేవతామూర్తుల బొమ్మలు ఆకట్టుకున్నాయి. మహిళలు, చిన్నారులు, పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి సహపంక్తి భోజనాలుచేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. వివిధ ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగాల్లో స్థిరపడిన కొమ్ముల కుటుంబ సభ్యులంతా ఒకరినొకరు అనురాగంగా పలకరించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఓఎన్జీసీ నిధులతో ఓడలరేవు గ్రామాభివృద్ధికి కృషి

అల్లవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ నిధులతో ఓడలరేవు గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని, సామాజిక బాధ్యతగా ఓఎన్జీసీ ప్రతిఏటా గ్రామస్తులకు సంక్రాంతి కానుకల కిట్లు ఇవ్వడం హర్షణీయమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం ఓడలరేవు జడ్పీ హైస్కూలు వద్ద ఓఎన్జీసీ అధికారుల సమక్షంలో 1400 కుటుంబాలకు సంక్రాంతి కానుకల కిట్ల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ నాయకుడు కొల్లు విష్ణుమూర్తి, ఓఎన్జీసీ అధికారులు ఆల్దా, సుమంత్, సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, డీసీ చైర్మన్ గోపీరాజు, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణ, కలిగితి సత్యనారాయణ, పినపోతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే

అల్లవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి పాలనతో గ్రామాలకు మంచి రోజులు వచ్చాయని, అందరూ ఐక్యతతో అభివృద్ధికి పాటుపడాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. జనసేన అధ్యక్షుడు నల్లా రాము అధ్యక్షతన కొమరగిరిపట్నంలో జరిగిన జనసేన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భోగి మంటలు, గంగిరెద్దుల ఆటలు, గరగ నృత్యాలు, మహిళలకు ఆటలు, ముగ్గులు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నడింపల్లి సీతారామరాజు, గుర్రం కృష్ణ, కటికిరెడ్డి బాబి, గునిశెట్టి రోహిణీకుమార్, పిండి గణపయ్య, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, మంతెన సురేష్‌రాజు, కంకిపాటి వీరబాబు, గుర్రం శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యల్లాప్రగడ జయంతి

ఐ.పోలవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మనిషి ఆయుష్షును పెంచిన తెలుగోడు యల్లాప్రగడ సుబ్బారావు అని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. జి.వేమవరంలో ఆదివారం యల్లాప్రగడ జయంతి జరిగింది. యల్లాప్రగడ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయిరాం విద్యానికేతన్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాస్, ఆర్ఎంపీ వైద్యులు రెల్లు గంగాధరం, పి.వెంకటేశ్వరరావు, కంతేటి కుమార్, ఆకుల సత్తిబాబు, ఇళ్ళ మణికంఠ, పుల్లెపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, జనవరి12(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తెలంగాణ, ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు అనంతరం లక్ష్మీనరసింహస్వామిని దర్శనం కోసం బారులు తీరారు. సుదర్శన హోమం తిలకించి పూజలు చేశారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం సాగరసంగమం తీరాన, బీచ్, లైట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో పర్యాటకులు, భక్తులు సందడి చేశారు.

హరిదాసుకు సన్మానం

మలికిపురం,జనవరి12(ఆంధ్రజ్యోతి):గుడిమెళ్లంకలో 40ఏళ్లుగా హరినామ సంకీర్తనలతో సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుతున్న హరిదాసు కొల్లిపాక సుబ్బారావును ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సేవాసమితి సభ్యులు, గ్రామస్తులు రూ.56,500 అందించారు.

క్రికెటర్ సత్యనారాయణరాజుకు ఘనస్వాగతం



మలికిపురంలో సత్యనారాయణరాజును సన్మానిస్తున్న నాయకులు

మామిడికుదురు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ ముంబై క్రికెట్ జట్టుకు ఎంపికైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠానికి చెందిన పెన్మెత్స సత్యనారాయణరాజుకు స్వగ్రామంలో ఘనసన్మానం లభించింది. సంక్రాంతి పురస్కరించుకుని ఐపీఎల్ క్రికెటర్ ఆదివారం స్వగ్రామం రాగా ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికి దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. గోగన్నమఠం గ్రామంలోని ధనమ్మతల్లి, సత్తెమ్మతల్లితో పాటు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. రంజీ క్రికెట్ క్రీడాకారుడైన అతని సోదరుడు పాండురంగరాజు కూడా అతనితో రావడంతో ఇద్దర్ని గ్రామస్తులు ఘనసత్కారం నిర్వహించారు. రాబోయే రోజుల్లో జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, భూపతిరాజు సత్తిబాబురాజు, సాగి నరసింహవర్మ(బాబు), సాగి సత్యనారాయణరాజు, భూపతిరాజు సతీష్‌రాజు, సాగి పాపయ్యరాజు తదితరులు ఉన్నారు.

ఐపీఎల్ క్రికెటర్ రాజుకు సన్మానం

మలికిపురం, జనవరి12(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతంలో పుట్టి ఐపీఎల్‌కు ఎంపికవ్వడం మన ప్రాంతానికే గర్వకారణమని శ్రీరామా బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ దెందుకూరి రాంబాబురాజు అన్నారు. ముంబయి ఐపీఎల్‌టీమ్‌కు ఎంపికైన గోగన్నమఠానికి చెందిన పెన్మెత్స సత్యనారాయణరాజును మలికిపురంలోని అకాడమీలో ఆదివారం దుశ్శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వక్తలు ఆకాంక్షించారు.జంపన బుజ్జిరాజు, బి.శ్రీనివాసరాజు, విశ్వనాథరాజు, కాకి లక్ష్మణ్, మిరియాల హనుమంతరావు, పల్లపోతు బంగారం పాల్గొన్నారు.

రాజోలులో కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలి

మలికిపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం రావులపాలెంలో జరిగిన సమావేశంలో కోరినట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో 10వేల హెక్టార్లలో కొబ్బరి పంట, 20లక్షల కొబ్బరిచెట్లు, ఏటా 20 కోట్ల కొబ్బరికాయల దిగుబడితో రూ.200కోట్ల వ్యాపారం జరుగుతోందన్నారు. రాజోలు నియోజకవర్గంలోని తూర్పుపాలెంలో కొబ్బరి ప్రోసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు 25ఎకరాల భూమిని గుర్తించామని, ప్రభుత్వం కొబ్బరి పారిశ్రామిక పార్కు పెట్టాలని కోరానన్నారు. దీనివల్ల రైతుకు గిట్టుబాటు ధర, పలువురికి ఉపాధి కల్పన జరుగుతుందన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

కాట్రేనికోన, జనవరి12(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, గుత్తుల సాయిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వివేకానంద జయంతి సందర్భంగా ఎమ్మెల్యే బుచ్చిబాబుతో కలిసి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొలకోటి వెంకటరెడ్డి, గ్రంధి నానాజీ, మట్ట శివకుమార్, చప్పిడి శ్రీదుర్గ, సఖిరెడ్డి శ్రీనివాస్, పొత్తూరి మూర్తిరాజు, బి.కనకరావు, అజయ్‌వర్మ, మట్టా సూరిబాబు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు పూర్తి

మామిడికుదురు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయాన్ని వివిధరకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గోదాదేవి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. భోగిమంటలు వేయడానికి 200అడుగుల భోగి పిడకల దండను సిబ్బంది తయారు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణమంతా సంక్రాంతి శోభతో కళకళ్లాడుతుంది. సంక్రాంతి సంబరాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోదాదేవి కల్యాణాన్ని వీక్షించాలని ఆలయ ఏసీ కోరారు.


డాక్టర్ సాయికుమార్‌కు అభినందనలు

రాజోలు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ములికిపల్లికి చెందిన కొడవటి రాధాకృష్ణ కుమారుడు డాక్టర్ సాయికుమార్ (ఎంబీబీఎస్) పీజీ రేడియోలజీ విభాగంలో సీటు సాధించిన సందర్భంగా తాటిపాకలో ఆర్కే ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు డాక్టర్ సాయికుమార్‌కు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కర్నీడి సతీష్‌బాబు, సలాది విష్ణురావు, నామన రాఘవేంద్రవరప్రసాద్, పెద్దిరెడ్డి దుర్గాప్రసాద్, నయినాల వెంకటేశ్వరరావు, అడబాల వెంకటగణేశ్వరరావు (చిన్ని), నయినాల వరాలబాబు, బత్తుల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

అమలాపురంరూరల్, జనవరి12(ఆంధ్రజ్యోతి): సంప్రదాయం ఉట్టిపడేలా భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులకు వంటలు, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పిండివంటలతయారీలో సత్తాచాటి అందరికీ నోరూరించేలా చేశారు. రెండెడ్ల బండ్లపై సవారీ చేసి సందడి చేశారు. పతంగుల పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గారడీ నృత్య కళాకారులు, శక్తివేషాలు, కోలాట ప్రదర్శనల్లో బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య ఉత్సాహంగా పాల్గొని నృత్యంచేస్తూ అందరిలోనూ ఉత్సాహాన్ని నింపారు. భోగిమంట టలువేసి ప్రభలను ఊరేగించారు. విద్యార్థులు సంప్రదాయం దుస్తులు ధరించి సందడి చేశారు. భోగిమంటలు వేసి ప్రభలను ఊరేగించారు. బీవీసీ కళాశాల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, పరిపాల నాధికారి జక్కం వెంకటకృష్ణారావు, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతి మృతితో విషాదఛాయలు



పి.గన్నవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అమ్మమ్మ ఇంటి వద్ద చదువుకుంటు సంక్రాంతి పండుగకు ఆనందంగా గడపడానికి స్వగ్రామం వెళ్లాలనే ఆనందంతో నూతన వస్త్రాలు తీసుకుని ఇంటికి చేరే సమయంలో ఆ యువతిని మృత్యువు కాటేసింది. లంకలగన్నవరానికి చెందిన ఓ చానల్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తోన్న దేగల ఏడుకొండలకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె రేణుక(18) తన అత్తగారిల్లు కాకినాడలోని జగన్నాధపురం ఇంటి వద్ద ఉండి చదువుకుంటుంది. కాకినాడలో నూతన వస్త్రాలు తీసుకుని తాతతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి చేరే సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రేణుక తీవ్రంగా గాయపడి మృతిచెందింది. రేణుక మృతితో లంకలగన్నవరంలో విషాదచాయలు అలుముకున్నాయి. రేణుక మృతదేహాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, ఎస్ఐ బి.శివకృష్ణ, నాయకులు గనిశెట్టి శ్రీనివాస్, శేరు శ్రీనుబాబు, చానల్, పత్రికా రిపోర్టర్లు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

- స్వామివారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి
- వెంకన్న ఒకరోజు ఆదాయం రూ.5.14 లక్షలు


హైకోర్టు జడ్జికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈవో

ఆత్రేయపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకువజామునే స్వామివారి స్నపన మూర్తులకు గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేద పారాయణం చేసి దర్శనాలకు అనుమతించారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు చేశారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మహేశ్వరరావు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఉంగుటూరి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

గోదా రంగనాథుల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నారు. నెల రోజులపాటు ధనుర్మాస ఉత్సవాలను నిర్వహించారు. సోమవారం గోదా రంగనాథుల కల్యాణంతో ధనుర్మాస ఉత్సవాలు ముగియనున్నాయి. గోదా కల్యాణానికి 1700 మంది ఆన్‌లైన్‌లో టిక్కెట్లు పొంది హాజరుకానున్నారు. శ్రీనివాస ప్రాంగణంలో కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భారీ సెట్టింగ్‌తో కల్యాణంలో పాల్గొనేలా టెంట్లు ఏర్పాటు చేశారు. ఖండవిల్లి వరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో గోదా కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు.

150 అడుగుల భోగిదండ: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భోగి వేడుకలను నిర్వహిస్తున్నారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఈ పండుగలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు భోగి మంటను వెలిగించనున్నారు. గోక్షేత్రంలోని ఆవుపేడతో 150 అడుగుల భోగి దండను తయారు చేసి ఆలయం వద్ద భోగి మంటలో వేయనున్నారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు వీటి ఏర్పాట్లు చేపడుతున్నారు.


గోదాదేవి కల్యాణానికి ముస్తాబు చేస్తున్న దృశ్యం


భద్రతా సిబ్బందికి నగదు అందిస్తున్న మంత్రి సుభాష్

మంత్రి సుభాష్ సంక్రాంతి కానుక

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సిబ్బంది 13 మందికి ఆదివారం సంక్రాంతి కానుకగా మంత్రి సుభాష్ రూ.65 వేలు అందించారు. ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున వారికి ఇచ్చారు. కార్యక్రమంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సెక్యూరిటీ సిబ్బంది, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందికి దుస్తులు: రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి 18 మంది పారిశుధ్య కార్మికులు, 12 మంది సెక్యూరిటీ సిబ్బందికి ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్ దుస్తులు అందించారు. సంక్రాంతిని పురస్కరించుకుని సిబ్బందికి వాటిని అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి బోర్డు చైర్మన్‌కు సత్కారం


కొబ్బరి బోర్డు చైర్మన్ శుభా నాగరాజును సత్కరిస్తున్న దృశ్యం

రావులపాలెం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్‌సీలో కొబ్బరి బోర్డు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కొబ్బరి బోర్డు చైర్మన్ శుభానాగరాజును సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు, కొత్తపేట అసెంబ్లీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, డేగల వెంకటరమణ, కర్రా సంతోష్‌శాస్త్రి, విళ్ల దొరబాబు, సీహెచ్ రాంబాబు, రాజు, మద్దింశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి మహాలక్ష్మి తదితరులు చైర్మన్ శుభా నాగరాజును సత్కరించారు.


ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఆలమూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. ఇందులో భాగంగా చదువుకున్న పాఠశాల ఆవరణలో మూడు దశాబ్దాల అనంతరం వారంతా కలుసుకున్నారు. 1994-95లో పదో తరగతి విద్యార్థులంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు పాత జ్ఞాపకాలతో గడిపారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులకు పాదాభివందనం చేసి సత్కరించారు. పూర్వ విద్యార్థుల కలయికకు కృషి చేసిన సాంబశివరావు, పుల్లేశ్వరరావు, వీవీవీఎస్ఎన్ మూర్తి, జయంతి రామకృష్ణ, సిద్ధిరెడ్డి నాగబాబు, తోరాటి వెంకటమహాలక్ష్మి, ముద్దాల వనజ, పాలపర్తి రత్నం, కిరణ్ తదితరులతో పాటు తోటి విద్యార్థులు అభినందించారు.

ఆపన్నులను ఆదుకోవడంలో చంద్రబాబు ముందుంటారు

కొత్తపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుంటారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం వాడపాలెం టీడీపీ కార్యాలయం వద్ద సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సుమారు ఆరుగురికి రూ.2.56 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, విళ్ల వీరమారుతిప్రసాద్, వాసంశెట్టి సత్యనారాయణ, రొట్టా సుబ్బారావు, వక్కపట్ల లక్ష్మణరావు, గుర్రాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


వాడపాలెంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

నేడు విజయదుర్గా పీఠంలో పౌర్ణమి పూజలు

రాయవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో 13న పాల్గుణ పౌర్ణమి పూజలు నిర్వహిస్తున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహిస్తామని తెలిపారు.


ఆలమూరు మండలం జొన్నాడలో స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


కె.గంగవరం: కోటిపల్లిలో వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


రాయవరం: వెదురుపాకలో వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

జయంతి వేడుకల్లో వక్తలు

ఆలమూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలన్నారు. ఆలమూరు మండలం జొన్నాడలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని జరిపారు. జొన్నాడలోని వివేకానంద యవజన సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి రామారెడ్డి అధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి మాజీ సర్పంచ్ ద్వారంపూడి అప్పారెడ్డి నివాళులర్పించారు. అనంతరం పలువురికి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాడి నాగమోహనరెడ్డి, గొలుగూరి సూర్రెడ్డి, కర్రి గంగిరెడ్డి తదితరులతోపాటు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు ఆధ్వర్యంలో నాయకులు స్థానికంగా ఉన్న వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంతాడ ముత్యాలు, పట్నాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆధ్యాత్మికవేత్త, గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వెదురుపాక గీతా మందిరంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్వామి వివేకానంద జీవితంపై వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో కొవ్వూరి సత్య విజయదుర్గ ప్రథమ, ఎస్.జాహ్నవి, హర్ష విజేతలుగా నిలిచారు. మిగిలిన విభాగాల్లో విజేతలుగా నిలిచిన సీహెచ్ హస్విత, ఎం.భువన, ఎ.భార్గవ్, ఎం.లహరి, బి.రమ్యశ్రీ, కె.శుభహాసిని, జి.లిఖిత, శ్రీమనోజ్ఞ, ఎస్.వంశీకృష్ణారెడ్డి, ఎం.వర్షినిలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అంగర జనార్ధనాచార్యులు, పడాల శివమణి కంఠరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురం: పడమరఖండ్రికలో స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని వక్తలన్నారు. మండలంలోని పడమరఖండ్రికలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, ముత్తా చిన్న, దానేటి శరత్, మేడేపల్లి కనకరామకృష్ణ, మేడిద రాంబాబు, ఆలపాటి నారాయణమూర్తి, ఎస్.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు, కేశన రాఘవేంద్ర, సలాది సతీష్‌నాయుడు, కొప్పిశెట్టి శ్రీను, అంకం ధనరాజు, ఖండవిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: వివేకానంద జయంతిని పురస్కరించుకుని వివేకానంద యోగాశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ప్రముఖ శిల్పి రాజకుమార్ వడయార్ శిల్పశాలలో ఉన్న వివేకానంద విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. యోగాశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు రక్తదానం చేయడంతో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారిశెట్టి సత్యనారాయణ, నల్లా గోపి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న శిల్పి రాజకుమార్ వడయార్

రథం దగ్ధం ఘటనలో హిందువులపై కేసు ఎత్తివేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 12(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో రథం దగ్ధం ఘటనలో హిందువులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఆదివారం మంత్రి సుభాష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఘటనలో 49 మంది హిందువులపై సంబంధం లేకపోయినా అక్రమంగా కేసులు పెట్టారన్నారు. అప్పట్లో 12 రోజులు రిమాండులో ఉంచారని తెలుగు రాష్ట్రాల హైందవ సైన్యం అధ్యక్షుడు పెనుగొండ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు రామచంద్రరావు, హైందవ సైన్యం జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి గణేష్‌శర్మ, తోటకృష్ణ, కె.చంద్రసాయి, నాని, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


అంగర వేణుగోపాలస్వామి ఆలయంలో లక్షతులసిపూజ నిర్వహించిన దృశ్యం

ఘనంగా లక్షతులసి పూజ

కపిలేశ్వరపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం లక్షతులసిపూజ జరిగింది. ఆలయ అర్చకులు ఎస్ఎల్ఎన్‌బి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, లక్షతులసి పూజ వంటివి శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు మహిళలు, భక్తులు, అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, జనవరి12(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తెలంగాణ, ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు అనంతరం లక్ష్మీనరసింహస్వామిని దర్శనం కోసం బారులు తీరారు. సుదర్శన హోమం తిలకించి పూజలు చేశారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం సాగరసంగమం తీరాన, బీచ్, లైట్ హౌస్ పరిసర ప్రాంతాల్లో పర్యాటకులు, భక్తులు సందడి చేశారు.


రామచంద్రపురంలో బెలూన్‌లను ఎగురవేస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. వీఎస్ఎంలో సంక్రాంతి శోభను ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. పూరి గుడిసెలు, హరిదాసు వేషధారణ, పల్లె వాతావరణం వంటివి కళ్లకు కట్టినట్టు తీర్చిదిద్దారు.

ఆకట్టుకున్న ఉత్సవ్ రన్: ముందుగా ఆర్డీవో కార్యాలయం నుంచి ఉత్సవ్ 2కె25 రన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యువతీ, యువకులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు. ఉత్సవ్ రన్ వీఎస్ఎంకు చేరుకుంది. అనంతరం మంత్రి సుభాష్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి బెలూన్లు ఎగురవేశారు. చిన్నారుల భరతనాట్యం ఆకట్టుకుంది.

ముగ్గుల పోటీకి స్పందన: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీకి స్పందన వచ్చింది. నియోజకవర్గం నలుమూలల నుంచి 200 మంది యువతులు, మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. వీఎస్ఎం కళాశాలను రంగవల్లులతో తీర్చిదిద్దారు. ముగ్గులను మంత్రి సుభాష్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, వాసంశెట్టి సత్యం తదితరులు సందర్శించారు. న్యాయనిర్ణేతలుగా వాసంశెట్టి శ్రీసత్య, వైట్ల గజలక్ష్మి, జాస్తి విజయలక్ష్మి, కొత్తపల్లి అరుణ వ్యవహరించారు.

బహుమతులు అందజేత: నంబోలు జ్యోతి శ్రావణికి వాషింగ్ మిషన్, కడలి శ్రీదేవికి రిఫ్రిజిరేటర్, వైదేశి సావిత్రి స్మార్ట్‌టీవీలను అందించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు కన్సొలేషన్ బహుమతులు అందచేశారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి: సంక్రాంతి పారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలన్నారు. సంక్రాంతి అంటే కోడి పందాలు మాత్రమే కాదన్నారు. సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి అన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


కొత్తపేట సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం

కొత్తపేట: భావితరాలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేలా సంక్రాంతి సంబరాలు చేపట్టాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. ఆర్ఎస్ టీసీ కన్వెన్షన్ హాలులో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిపారు. మహిళలకు రంగవల్లులు, మ్యాజిక్ చైర్, సంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలు, డూడు బసవన్నల విన్యాసాలు వంటివి నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, జీపీ నాయుడు, ఏ.రిశ్వంత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు

రావులపాలెం: సంక్రాంతి పేరిట కోడి పందాలు, పేకాట, గుండాట, జూదాలు, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు హెచ్చరించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కోడిపందాల బరులను రెవెన్యూ అధికారులతో కలిసి తొలగించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజాత, ఎస్ఐ చంటి, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ఆలమూరు: ఆలమూరు మండలం నర్సిపూడిలో ఆదివారం సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. దివంగత రాయుడు సంకు కుటుంబీకుల అధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు నర్సిపూడితోపాటు పలు గ్రామాల మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రాయుడు వెంకటస్వామి, రాయుడు సతీష్‌లు లేడీస్ సైకిల్, గ్యాస్‌స్టౌవ్, మిక్సీ అందించారు. పది మందికి కన్సొలేషన్ బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతి అందించారు. కార్యక్రమంలో ఆలమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ దునే స్వామినాయుడు, మాజీ సర్పంచ్ గుత్తుల శ్రీరాములు, పలువురు కూటమి నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, చామకూరి శ్రీను, ఉండమట్ల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ సమస్య పరిష్కారానికి ఫ్లెక్సీ ఏర్పాటు

కపిలేశ్వరపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అంగరలో డంపింగ్ యార్డు సమస్యకు అంగర, పడమరఖండ్రిక ప్రజలు ఆదివారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సంక్రాంతి సందర్భంగా అన్ని గ్రామాల్లో శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు పెట్టగా అంగర గాంధీబొమ్మ సెంటర్‌లో సమస్యల పరిష్కారానికి ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరిస్తారని కోరుతున్నామన్నారు. అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో డంపింగ్‌యార్డ్ సమస్యగా మారిందని, దీనివల్ల విద్యార్థులు, ఆసుపత్రికి వచ్చే రోగులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను హైస్కూల్, హాస్పిటల్ సమీపానికి తరలించి నిప్పుపెట్టడం ద్వారా వచ్చే పొగ వల్ల అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. గ్రామంలోని ఒకదాత ఇందుకోసం స్థలం ఇచ్చేందుకు ముందుకు వచ్చినా కొంత మంది నాయకులు దానికి అడ్డుపడుతున్నారన్నారు. ఇందుకోసం వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని చేశామని నిర్వాహకులు తెలిపారు.


ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో కోడిపందాలకు సిద్ధమైన బరులు

కోడి పందాలకు సై

ఆత్రేయపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కోడిపందాలు నిర్వహించేందుకు పందెంరాయళ్లు సై అంటున్నారు. ఇందులో భాగంగా వందలాది పుంజులను పందాలకు సిద్ధం చేశారు. సంక్రాంతి మూడు రోజులూ కోడి పందాలు, గుండాట, పేకాట వంటివి నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చురుకుగా చేస్తున్నారు. పేరవరం, వద్దిపర్రు, లొల్ల, ఆత్రేయపురం, ర్యాలి, తాడిపూడి తదితర గ్రామాల్లో పందెంరాయుళ్లు పంట పొలాల్లో బరులను సిద్ధం చేసేశారు. పందాలు నిర్వహించే ఆయా శిబిరాల్లో అన్ని హంగులతో ఏర్పాట్లు చేపట్టారు. కోడిపందాలు, గుండాటలు, విచ్చలవిడిగా నిర్వహించనున్నారు. ఇందులో కోట్లాది రూపాయలు చేతులు మారగా వందల పందెం పుంజులు నెలకొరగనున్నాయి. పందెంరాయుళ్లు ఆయా శిబిరాల వద్ద బరులు ఏర్పాటు చేసినా, పోలీసు యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తోందన్న ఆరోపణలున్నాయి.

సంక్రాంతికి మీ ఊరికి వస్తున్నాం'

సినీ హీరోయిన్ మీనాక్షీ చౌదరి



అమలాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి. ఆ సంక్రాంతికి మీ ఊరికి వస్తున్నాం. కుటుంబ సమేతంగానే కాదు పండుగకు వచ్చిన బంధువర్గీయులు, స్నేహితులు అందరూ చూసే సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' అని ఆ చిత్ర హీరోయిన్ మీనాక్షీ చౌదరి తెలిపారు. ఆదివారం అమలాపురంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె కొద్దిసేపు విలేకరులతో సినిమా కబుర్లు చెప్పారు. 'ఇప్పటివరకు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించాను. తెలుగు ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ మరిచిపోలేను. గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం' సినిమాతో వచ్చాను. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం.. చిత్రంలో మీనా పాత్ర మంచి గుర్తింపు తీసుకుకొస్తుంది. వెంకీ మామతో కలిసి నటించిన ఈచిత్రం ప్రేక్షకుల ఆశీస్సులు, ఆదరాభిమానాలతో గ్యారంటీగా ఘన విజయం సాధిస్తుంది. సినిమాలోని కామెడీ బ్లాక్ బస్టర్ రేంజ్‌లో ఉంటుంది. దర్శక, నిర్మాతలు సైతం లక్కీ హ్యాండ్‌గా గుర్తించి ప్రేక్షకులకు కలకాలం గుర్తుండే పాత్రలు నాకివ్వడం చాలా ఆనందంగా ఉంది. గతంలో ఒకసారి కోనసీమకు వచ్చా. మళ్లీ ఇక్కడకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. సంక్రాంతి పండుగ అంతా ఇక్కడే కనిపిస్తోంది. ఈ ప్రాంత ప్రజల అతిథి మర్యాదలను ఎప్పటికీ మరిచిపోలేను' అని మీనాక్షీ చౌదరి తెలిపారు.

రాజోలులో కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలి

మలికిపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోకోనట్ డెవలెప్‌మెంట్ బోర్డు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం రావులపాలెంలో జరిగిన సమావేశంలో కోరినట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. రాజోలు నియోజకవర్గంలోని తూర్పుపాలెంలో కొబ్బరి ప్రోసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు 25ఎకరాల భూమిని గుర్తించామని, ప్రభుత్వం కొబ్బరి పారిశ్రామిక పార్కు పెట్టాలని కోరానన్నారు.